రూ.6 కోట్లతో ఆధునిక కల్యాణ మండపం

- బాలాజీనగర్‌లో నిర్మాణానికి మేయర్ హరివెంకటకుమారి శంకుస్థాపన



కల్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్‌లో రూ.6 కోట్ల నిధులతో ఆధునిక కల్యాణ మండపం నిర్మించనున్నారు. ఈమేరకు శుక్రవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, పెద్దలతో కలిసి శంకుస్థాపన చేసి ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె శిలాఫలకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ ఇక్కడ గతంలో ఉన్న జీవీఎంసీ కల్యాణ మండపం శిథిలం కావడంతో ఇటీవల తొలగించామని చెప్పారు. పేదలు అత్యధికంగా ఉన్న ఈ ప్రాంతానికి పెద్ద కల్యాణం మండపం అవసరమన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని విశాలమైన ఇక్కడి స్థలంలో వెంటనే కల్యాణ మండపం నిర్మించాలని జీవీఎంసీ అధికారులతో చర్చించామని తెలిపారు. దీంతో ఇక్కడ ఆధునిక సదుపాయాలతో మండపం నిర్మించడానికి అధికారుల ముందుకొచ్చారన్నారు. రూ.6 కోట్లతో జీ ప్లస్ టు నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిది నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. వేగవంతంగా పనులు జరిపించాలని ఇంజినీరింగ్ అధికారులను మేయర్ ఆదేశించారు.

నెలాఖరుకు రైతుబజార్ ప్రారంభం

ఆరిలోవ తోటగరువులో రైతుబజార్ నిర్మాణం పూర్తయిందని మేయర్ హరివెంకటకుమారి తెలిపారు. దాన్ని ఈ నెలాఖరుకు ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే ఆరిలోవలో రహదారులను విస్తరించినట్లు చెప్పారు. పెదగదిలి కూడలి నుంచి తోటగరువు, అంబేడ్కర్ కూడలి, చినగదిలి బీఆర్‌టీఎస్ కూడలి వరకు రింగ్ రోడ్డు నిర్మాణం ప్రతిపాదన జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మేయర్‌ను స్థానికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహనరావు, స్థానిక నాయకులు కొల్లి అప్పారావు, సూరిబాబు, సకీనా, బోను శ్రీను, పాలవలస శ్రీహరి, రామిరెడ్డి, జహంగీర్, మక్బూల్, పెద్దలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

భక్తిగీతాలాపన, నృత్యాలతో అలరించిన విద్యార్థులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి



కీర్తనలు ఆలపిస్తున్న నాట్యపరిమళ అకాడమీ విద్యార్థులు

ఎంవీపీకాలనీ: వేంకటేశ్వర స్వామి శ్రావణ సంగీతోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం వేదికగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నాట్యపరిమళ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు శ్రీవారి గీతాలను ఆలపించి అలరించారు. మయూరి నృత్య నికేతన్ విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రోజు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ ఉత్సవాల్లో నాట్యం, సంగీతం, ఇతిహాసాలు, పురాణ గాథలపై ప్రదర్శనలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 16 వరకు సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, ప్రతి రోజు రాత్రి 8.30 గంటలకు హారతి, ప్రసాద వితరణ నిర్వహిస్తామని చెప్పారు.

ఎంవీపీ బస్‌స్టేషన్ పార్సిల్ కౌంటర్ పరిశీలన



పార్సిల్ కౌంటర్‌లో పరిశీలిస్తున్న చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ ఆర్టీసీ బస్ స్టేషన్‌లోని పార్సిల్ కౌంటర్ పాయింట్‌ను శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఆపరేషన్స్ అండ్ కమర్షియల్ బి.అప్పలనాయుడు ఆకస్మికంగా పరిశీలించారు. ఏటీపీ పార్సిల్ సర్వీసులను పర్యవేక్షించారు. వినియోగదారులకు అందిస్తున్న సేవలను, పార్సిళ్ల చేరవేతకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్సిల్స్ చేరవేతలో వినియోగదారులకు నమ్మకమైన, వేగవంతమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఎంవీపీ బస్‌స్టేషన్‌లోని పార్సిల్ కేంద్రాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ఏమూలకైనా ఇక్కడి నుంచి సర్వీసులు అందుబాటులో ఉన్నాయన్నారు. సూపర్ వైజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెచ్‌ఐవీ బాధితులకు ప్రత్యేక సేవలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: హెచ్‌ఐవీతో జీవిస్తున్న పిల్లలు, గర్భిణులకు ప్రత్యేక సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు జిల్లాల సిబ్బందితో శుక్రవారం నగరంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఐవీ బాధితులకు ఎలా సేవ చేయాలన్న దానిపై సిబ్బందికి శిక్షణ కూడా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ క్రిస్టఫర్, డాక్టర్ ప్రభు, మేనేజర్ శైలజ, సూపర్‌వైజర్ భద్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం



విభాగాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం చరిత్ర, ఆర్కియాలజీ విభాగాన్ని శుక్రవారం విద్యార్థులు శ్రమదానంతో శుభ్రం చేశారు. విభాగంలోని మ్యూజియం, గ్రంథాలయం ప్రాంగణాలను శుభ్రపరిచారు. విభాగాధిపతి ఆచార్య సిహెచ్.మధుసూదనరావు ఆధ్వర్యంలో విద్యార్థులు విభాగాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనులు నిర్వహించారు. ఏయూలో త్వరలో నాక్ బృందం పర్యటించనుంది, ఈ నేపథ్యంలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన మ్యూజియాన్ని శుభ్రం చేసి విద్యార్థులకు ఉపయుక్తంగా తీర్చిదిద్దారు.

కృష్ణా జూనియర్ కాలేజీ విద్యార్థికి విట్‌లో సీటు



సనపల సాయిమణి

మద్దిలపాలెం: తమ కళాశాల విద్యార్థి సనపల సాయిమణి అమరావతిలోని ప్రతిష్టాత్మకమైన వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్)లో ఉచిత సీటు సాధించాడని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బి.సుజాత తెలిపారు. ఇది తమ కళాశాలకు గర్వకారణమన్నారు. 2022–23 విద్యా సంవత్సరానికి జగనన్న ఆణిముత్యాలు కింద సాయిమణి రూ.15 వేల నగదు పొందాడని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థి సాయిమణిని కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సత్కరించి అభినందించింది. కళాశాల ఎన్‌సీసీ అధికారి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైడేతో దోమల నిర్మూలన

సీతంపేట: వారం రోజులకు పైగా నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని జీవీఎంసీ, మలేరియా సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్రైడే–డ్రైడే సందర్భంగా జగన్నాథపురం మూడు గుళ్ల వద్ద స్థానిక మహిళలకు దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్షా కాలం దృష్ట్యా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న కార్పొరేటర్ ముష్వల లక్ష్మి



దేశభక్తి గీతానికి నృత్యం చేస్తున్న చిన్నారులు

ఏయూక్యాంపస్: బాల్యం నుంచి చిన్నారుల్లో దేశభక్తి, జాతీయ భావాన్ని పెంపొందించాలని 20వ వార్డు కార్పొరేటర్ ముష్వల లక్ష్మి అన్నారు. స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానిక జీవీపీ ఎంఎల్‌బీటీ పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. విద్యతోపాటు కళలు, క్రీడల్లో చిన్నారులను ప్రోత్సహించాలని, ఈ దిశగా కృషిచేస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. విజయనగరం మహారాజ సంగీత నృత్య కళాశాల ఆచార్యురాలు ఎస్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ కళలు మనిషి ఎదుగుదలకు, శారీరక మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు కార్పొరేటర్ లక్ష్మి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కె.మధురవాణి, బి.ప్రసన్న, ఎం.పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఎంవీపీకాలనీ: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఎంవీపీ కాలనీలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సొసైటీ లైఫ్ మెంబర్ పి.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 9 గంటల నుంచి ఎంవీపీ కాలనీ సెక్టార్-7 ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్ ఎదురుగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. యువతతోపాటు స్థానికులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

దేశభక్తిని పెంచిన తిరంగా యాత్ర



జాతీయ జెండాలతో పాదయాత్ర చేస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: స్వాతంత్ర్య దినోత్సవ ఆవశ్యకత, ప్రాధాన్యతా చాటి చెప్పేలే తిరంగా పాదయాత్ర నిర్వహించారు. 20వ వార్డు జీవీపీ ఎంఎల్‌బీటీ పాఠశాల విద్యార్థులు శుక్రవారం జాతీయ జెండాలు పట్టుకుని పాదయాత్ర చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా యాత్రలో భాగస్వాములయ్యారు. పలువురు విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలో ర్యాలీలో పాల్గొనడం విశేషం. బీచ్ రోడ్డు, ఈస్ట్ పాయింట్ కాలనీల్లో పాదయాత్ర సాగింది. పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి పెరగాలి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో జాన్‌వెస్లీ, రోనాల్డ్ విలియమ్స్

బీచ్‌రోడ్డు: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బి.జాన్‌వెస్లీ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎంసీఏ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దేశభక్తితోపాటు పోటీతత్వం కూడా పెరుగుతుందన్నారు. ఈ పోటీల్లో నగరంలోని 25 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నట్లు వైఎంసీఏ రీజనల్ చైర్మన్ రోనాల్డ్ విలియమ్స్ తెలిపారు. కార్యక్రమంలో వైఎంసీఏ జాతీయ ఉపాధ్యక్షురాలు జెట్సీ విలియమ్స్, సభ్యులు ఇజ్రాయిల్, మిన్నీ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

కళాభారతిలో నేడు ‘శ్రీకృష్ణ రాయబారం’ బుర్రకథ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం శ్రీకృష్ణ రాయబారం బుర్రకథ ప్రదర్శించనున్నామని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్యనారాయణరాజు, డాక్టర్.వి.ఆర్.కె.రాంబాబు తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు తాడేపల్లిగూడెం కళాకారులచే బుర్రకథ ప్రారంభమవుతుందన్నారు. బుర్రకథలో కథకులుగా మిరియాల వెంకటేశ్వరరావు, రాజకీయం మిరియాల సత్యనారాయణ, హాస్యం మిరియాల సాయిరాంలు వ్యవహరించనున్నారన్నారు. ఈ ప్రదర్శనకు అందరూ ఆహ్వానితులేని, తిలకించి ఆనందించాలని వారు కోరారు.

ఫైనాన్షియల్ మార్కెట్‌పై అవగాహన



ప్రసంగిస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్

ఏయూక్యాంపస్: స్టాక్ మార్కెట్‌లో అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ సీఈవో డాక్టర్ సతీష్‌కుమార్ ఆర్య అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో శుక్రవారం ఫైనాన్షియల్ మార్కెట్ సర్వీసెస్‌లో అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జీఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జున రావు, అపోలో హాస్పిటల్స్ అధినేత ప్రతాప్‌రెడ్డిల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సంస్థ సీనియర్ మేనేజర్ కె.రాజేశ్వర రెడ్డి స్టాక్ మార్కెట్, షేర్లు, ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్స్ తదితర అంశాలను వివరించారు. ఫండ్‌ల నిర్వహణపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మేనేజర్ వై.సాంబమూర్తి ఇంటర్న్‌షిప్‌ల అందించే విధానాన్ని వివరించారు. మూలధనాన్ని ఏ విధంగా వినియోగించవచ్చు, జ్ఞానాన్ని సంపదగా మార్చుకోవడం ఎలా అనే విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఆచార్య ఎస్.సాంబశివరావు, డాక్టర్ బి.సుబ్బయ్య, సురేష్, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



ఆర్థిక సాయం అందిస్తున్న కార్యేషు ప్రతినిధులు, పేడాడ రమణికుమారి

బీచ్‌రోడ్డు: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడం ఎంతో అవసరమని వైఎస్సార్‌సీపీ నాయకురాలు పేడాడ రమణికుమారి అన్నారు. కార్యేషు ఈవెంట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో శ్రావణ సఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక ప్రగతి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. ఏడేళ్లుగా నగరంలోని మహిళల అభ్యున్నతి కోసం కార్యేషు ఈవెంట్స్ సంస్థ అనేక కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యేషు సంస్థ ఎండీ జయశ్రీ మాట్లాడుతూ ఈ ఏడాది సేవా కార్యక్రమంలో భాగంగా లయోలా, సద్గురు వృద్ధాశ్రమాలకు చెరో రూ.50 వేల విరాళం అందించామన్నారు. వీటితోపాటు నిరుపేద కుటుంబాలకు జీవనోపాధిని మెరుగుపర్చుకునేందుకు రూ.80 వేల ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మహిళలు డ్యాన్స్‌లు, పాటలతో సందడి చేశారు. బీజేపీ అధికార ప్రతినిధి సుహాసినీ ఆనంద్, సంస్థ ప్రతినిధులు ఇందిరా ప్రియదర్శిని, సుందర లక్ష్మి, ఉష, మాధురి, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య సుధాకర్ నియామకంపై హర్షం



ఆచార్య సుధాకర్‌ను అభినందిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఏయూ ఆచార్యుడు జి.సుధాకర్ నియామకం కావడంపై నగర ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు శుక్రవారం ఆయా సంఘాల ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, పరిశోధకులు ఆచార్య సుధాకర్‌ను ఏయూలో కలిసి అభినందనలు తెలిపారు. ఆయనకు మృదు స్వభావిగా, నిబద్ధత కలిగిన ఆచార్యుడి మంచి గుర్తింపు ఉందన్నారు. ఏయూ హ్యూమన్ జెనెటిక్స్ విభాగ సీనియర్ ఆచార్యుడైన సుధాకర్‌ను రిజిస్ట్రార్‌గా నియమించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ఆయనకు ఈ నియామకంతో మరింత మంది వెనుకబడిన వర్గాలకు సేవలు అందించే అవకాశం లభించిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అర్జునుడు, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రాజ్‌కుమార్, సీహెచ్ బాబ్జీ, పితాని ప్రసాద్, డాక్టర్ గోవింద్, డాక్టర్ దంతేశ్వర్ పట్నాయక్, డాక్టర్ దేవానంద్, డాక్టర్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరి

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేశారు. గురుద్వారా, ఆశీలమెట్ట, రామాటాకీస్, బాలయ్యశాస్త్రి లేఅవుట్ మొదలగు ప్రాంతాల్లో ట్రాఫిక్ రూల్స్ పాటించని చోదకులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. భారీగా చలానాలు వసూలు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ రామ్మూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉండాలన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, అతివేగం వద్దని సూచించారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 411 కేసులు నమోదు చేయగా.. 315 వాహనాలు విడుదల చేశామని, రూ.5,15,550 జరిమానా విధించామని ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. మోటార్ వెహికల్ కేసులు 23,906 నమోదు చేయగా.. రూ.1,30,315 ఫైన్‌లు వేసినట్లు చెప్పారు.

పరేడ్ రిహార్సల్స్ పరిశీలన



పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలిస్తున్న అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లా పోలీసులు పరేడ్ కోసం విశాఖపట్నం కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో రిహార్సల్స్ నిర్వహిస్తున్నారు. దీనిని శుక్రవారం ఆ జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయనకు ఇక్కడి సిబ్బంది గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 15 వేడుకలు అనకాపల్లి ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దాని కోసం కవాతు బాగా జరపాలని రిహార్సల్స్ చేస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు పరేడ్ ఆకట్టుకునేలా రిహార్సల్స్ చేయాలని సిబ్బందికి సూచించారు. అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏఆర్ఐలు బి.రామకృష్ణారావు, కె.వెంకటరావు, ఎం.సతీష్, కె.అరవింద్ కిశోర్ పాల్గొన్నారు.

రోల్‌బాల్ పోటీలకు మురళీనగర్ క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మురళీనగర్: మురళీనగర్ స్కేటింగ్ రింక్‌లో సాధన చేస్తున్న మురళీనగర్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ పి.సంతోష్ తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో తిరుపతిలో నిర్వహించనున్న ఈ పోటీలకు అండర్-14 బాలికలు, బాలుర విభాగానికి ఎంపికైన వీరు మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు నుంచి శుక్రవారం బయలు దేరారు. పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి నాగరాజు, శాంతి భూషణం, నిర్వాహకురాలు లలితప్రియ వీరికి శుభాకాంక్షలు తెలిపారు.

సాహిత్యంతోనే సామాజిక చైతన్యం

తాటిచెట్లపాలెం: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం విశాఖ సంస్కృతి మాసపత్రిక 11వ వార్షికోత్సవం, మక్కెన రామ సుబ్బయ్య ఫౌండేషన్ 9వ సాహిత్య పురస్కారాల ప్రదాన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాంకీ ఫౌండేషన్ ప్రెసిడెంట్, కవి, కథా రచయిత ఎం.వి.రామిరెడ్డి మాట్లాడుతూ సాహిత్యంతోనే సామాజిక చైతన్యం ఏర్పడుతుందన్నారు. కందుకూరి, గురజాడ, శ్రీశ్రీ వంటి అభ్యుదయ కవులు తమ సాహిత్యం ద్వార ప్రజలను చైతన్యపరిచారన్నారు. ఇటువంటి కవుల రచనలు ప్రజలకు చేరువ కావడానికి సాహిత్య పత్రికలే కారణమన్నారు. గరివిడి కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ మక్కెన శ్రీను తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన శ్రీ మక్కెన రామ సుబ్బయ్య ఫౌండేషన్ 9వ సాహిత్య పురస్కారాలతో ఎంపికైన ఆరుగురు రచయితలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, నగదు అందజేశారు. బాలల కేటగిరిలో కథ, గేయ, కవిత ప్రక్రియల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలైన శివాజీపాలెం జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు గౌరవ అతిథి డాక్టర్ మజ్జి శశిభూషణరావు ప్రశంసాపత్రాలు అందించారు. విశాఖ సంస్కృతి మాసపత్రిక సంపాదకుడు శిరేల సన్యాసిరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రచయితలు మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, ఆచార్య వెలమల సిమ్మన్న, డి.వి.సూర్యారావు, జె.వి.శర్మ, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పలువురు కవులు, రచయితలు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.